క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌టౌన్-1, కలెక్టరేట్ ఫీడర్ పరిధిలోని 11 కేవీలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. చింతకుంటవాడ, రాయల్ బిల్డింగ్, పాతబస్టాండ్, పింజరిగుట్ట, బుధవార్‌పేట్, కలెక్టర్, ఎస్పీ క్యాంప్ కార్యాలయం, మయూరి హోటల్, పంజేషాగల్లి, బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



పొక్లెయినర్‌తో కూల్చివేసిన సిబ్బంది

సోన్: మండలంలోని సాకెర గ్రామంలో నీటి పారుదలశాఖ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను శనివారం అధికారులు పొక్లెయినర్‌తో కూల్చివేయించారు. ఈసందర్భంగా ఆర్ఐ షేక్ రఫీక్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూల్చివేశామని.. అక్రమ కట్టడాలు నిర్మిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నీటి పారుదలశాఖ అధికారులు ఏఈ మధుకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, సర్వేయర్ ఖాదర్, ఎస్సై భూమేశ్వర్, పోలీసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల విరాళం



విరాళం ఇస్తున్న ఉపాధ్యాయులు

కుంటాల: మండలంలోని మెదన్‌పూర్ పాఠశాలలో పని చేసిన ఈరవత్రి నరేశ్, రవీందర్, జగదీశ్వర్ ఇటీవల బదిలీపై వెళ్లారు. శనివారం వీరిని పాఠశాలలో గ్రామస్తులు సన్మానించారు. అనంతరం వీరు పాఠశాల అభివృద్ధి కోసం రూ.20వేలు, మైక్‌సెట్ కోసం రూ.6వేలను విరాళంగా అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం నవనీత్, మాజీ సర్పంచ్ చంద్రకాంత్ పటేల్, నారాయణరావు పటేల్, భోజాబాయి, రామారావు, గోపాల్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌పై శిక్షణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న క్రీడాకారుడు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షోయబ్ హుస్సేన్, హెచ్ఎం నరేందర్, విశాంత్ర పీఈటీ షేక్ ఇమామ్, పీఈటీ ఇమ్రాన్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత క్రమశిక్షణతో ముందుకుసాగాలి



మాట్లాడుతున్న సీఐ సైదారావు

ఖానాపూర్: యువత క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితేనే నిర్దేశించుకున్న లక్ష్యం చేరుకుంటారని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. శనివారం మండలంలోని మస్కాపూర్ సీఎంరావు ఫంక్షన్‌హాల్‌లో విద్యార్థులు, యువతీ, యువకులకు గంజాయి, మత్తుపదార్థాలతో కలిగే అనర్థాలు, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై షీటీం సభ్యులు అవగాహన కల్పించారు. దీనికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సై లింబాద్రి, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలి

లోకేశ్వరం: గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. శనివారం మండలంలోని కన్కపూర్, నగర్, పిప్రి, గడ్‌చాంద గ్రామాల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, ఎస్సార్పీ సురేందర్, భగవాన్, డీఆర్పీ రమేశ్, వెంకటేశ్, టీఏలు రవీందర్, హరిత, శారద, ఎఫ్ఏలు సాయన్న, రమేశ్, అంజయ్య, ఉపాధి కూలీలు ఉన్నారు.

హైవే నిర్వహణపై పట్టింపేది..?

- భైంసాలో ఇబ్బంది పడుతున్న వాహనదారులు



శివాజీనగర్ కమాన్‌వద్ద రోడ్డు ఆనుకొని గుంత



హైవేను ఆనుకుని కచ్చా డ్రెయిన్



బాసర చౌరస్తా వద్ద రోడ్డుపై నీరు




గీత పెట్రోల్‌బంక్ సమీపంలో..

భైంసాటౌన్: భైంసా–నిర్మల్ మార్గంలో పట్టణం మీదుగా వెళ్తున్న 61వ జాతీయ రహదారి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. భైంసాలో బాసర చౌరస్తా నుంచి పార్డి(బి) బైపాస్‌రోడ్డు వరకు జాతీయ రహదారి విస్తరించి ఉండగా.. చాలాచోట్ల రహదారి కుచించుకుపోయింది. కొన్నిచోట్ల రోడ్డుపై మట్టి పేరుకుపోవడంతో రహదారి హద్దులు కనిపించడం లేదు. మరికొన్ని చోట్ల రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలుస్తోంది. ముఖ్యంగా పట్టణంలో జాతీయ రహదారికి పక్కన ఓ వైపు డ్రెయినేజీ లేకపోవంతో కచ్చా డ్రెయిన్ల నుంచి మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. టోల్ రహదారి నిర్వహణ ఇలాగేనా అని పలువురు వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. రహదారి నిర్వహణపై హైవే పీడీ శ్రీనివాస్‌రెడ్డిని 'సాక్షి' ఫోన్‌లో వివరణ కోరగా వాహనదారులకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం.. నిలిచిన రాకపోకలు

- పెంబి మండలంలోని పలు గిరిజన గ్రామాలకు నిలిచిన రాకపోకలు



పెంబి : మోరోన్ పరుపు వద్ద చెక్‌డ్యాంపై ప్రవహిస్తున్న కడెం వాగు



లక్ష్మణచాందలో కురుస్తున్న వర్షం



భైంసాలో బైక్‌పై పడిన చెట్టు

లక్ష్మణచాంద: మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. శనివారం ఉదయం నుంచి వర్షం కురుస్తుండటంతో ఆయా గ్రామాల్లో పంట చేన్లలో నీరు నిలిచింది. ఇలాగే వర్షం కురిస్తే పంటలు నీట మునిగి.. నష్టం వాటిల్లే అవకాశం ఉందని అన్నదాతలు వాపోతున్నారు.

పొంగిన కడెం, దోత్తి వాగులు

పెంబి: మండలంలో శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి వాగులు పొంగిపొర్లుతున్నాయి. కడెం, దోత్తి వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో యాపలగూడ, రాంనగర్, వస్‌పెల్లి, దోందారి, చాకిరేవు, పస్పుల, తదితర గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

భైంసాలో విరిగిపడిన చెట్టు

భైంసాటౌన్: పట్టణంలో శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లపై జనసంచారం నామమాత్రంగానే కనిపించింది. సాయంత్రం నిర్మల్ చౌరస్తా సమీపంలో ఓ చెట్టు విరిగిపడటంతో అక్కడ నిలిపి ఉంచిన బైక్ ధ్వంసమైంది. మున్సిపల్ సిబ్బంది వచ్చి కిందపడిన చెట్టును తొలగించారు.

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుంచి వర్షం కురుస్తుంది. దీంతో రైతులు, వ్యాపారులు ఇళ్లకే పరిమితమయ్యారు. పలు చోట్ల నిలిచిన వరద నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు..

ఎగువ నుంచి వస్తున్న వరదతో ఖానాపూర్‌లోని అంబేద్కర్‌నగర్ శివారు నుంచి దిలావర్‌పూర్ వెళ్లే మార్గంలో ఉన్న తాత్కాలిక రోడ్డు శనివారం రాత్రి కొట్టుకుపోయింది. వాగు నుంచి వచ్చిన వరదతో పడిన గండి పెద్దదైంది. ఇక్కడ కొద్ది నెలల కిందట చేపట్టిన వంతెన నిర్మాణ పనులు అనివార్య కారణాలతో నిలిచిపోయాయి. ఈ తాత్కాలిక రోడ్డుపై నుంచే సుమారు 20 గ్రామాలకు రాకపోకలు సాగించేవారు. అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించండి



సోన్: న్యూవెల్మల్ బొప్పారం పాఠశాలలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజమల్లు

సోన్: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామ ప్రత్యేకాధికారి రాజమల్లు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం సోన్‌తోపాటు మండలంలోని ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో పోషకుల సమావేశం నిర్వహించారు. న్యూవెల్మల్ బొప్పారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామ ప్రత్యేకాధికారి రాజమల్లు పాల్గొని మాట్లాడారు. ఇంటి వద్ద పిల్లలు చదివేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు, వీడీసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చూడాలి

లక్ష్మణచాంద: విద్యార్థులు నిత్యం పాఠశాలకు వచ్చేలాగా పోషకులు చూడాలని మండలంలోని వడ్యాల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం అశోక్‌వర్మ పేర్కొన్నారు. ఈ మాసంలో మూడో శనివారం కావడంతో విద్యార్థుల పోషకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు ఇచ్చిన హోంవర్క్‌ను ఇంటి వద్ద చేయించాలని సూచించారు. ఇందులో ఉపాధ్యాయులు, సీఆర్పీ సుధాకర్ ఉన్నారు.

ఖానాపూర్: విద్యార్థులు నిత్యం పాఠశాలకు వచ్చేలా వారి తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజలింగం అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

గోసంరక్షణ అందరి బాధ్యత

భైంసారూరల్: గో సంరక్షణ అందరి బాధ్యత అని గో సేవా విభాగం సభ్యులు నూకల సురేశ్ అన్నారు. శనివారం మండలంలోని సుంక్లి గ్రామంలో గోపోషకులు గంగాధర్‌పటేల్ దంపతులను సన్మానించారు. గోఆధారిత వ్యవసాయం, ఆవుపాల ఆవశ్యకత వివరించారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ సహకార్యవాహ దిగంబర్, కొరడి గణపతి ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మణ్‌రావు తదితరులు ఉన్నారు.

రుణమాఫీపై ఫిర్యాదుల విభాగం ఏర్పాటు

సోన్: మండల కేంద్రంలోని రైతువేదికలో రుణమాఫీపై ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసినట్లు ఏవో వసంత్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రుణమాఫీపై సందేహాలుంటే రైతువేదికలో ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు.

కేజీబీవీలో ఫాగింగ్

లక్ష్మణచాంద: విద్యార్థినులు వ్యాధుల బారిన పడకుండా శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీలో పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేశారు. దోమల నివారణకు లక్ష్మణచాంద పంచాయతీ కార్యదర్శి విక్రమ్‌రాజ్ తరగతి గదుల్లో ఫాగింగ్ చేయించారు.

పాఠశాలలో గ్రీన్ డే

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్లోబల్ అభ్యాస్ పాఠశాలలో శనివారం గ్రీన్ డే నిర్వహించారు. విద్యార్థులు చెట్ల వేషధారణలో కనువిందు చేశారు. మొక్కలను సంరక్షిద్దాం.. మానవాళి సంక్షేమాన్ని కోరుకుందాం అంటూ ప్రతిజ్ఞ చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

తానూరు: మండలంలోని బోల్సాలో మాజీ వైస్ ఎంపీపీ చంద్రకాంత్ తండ్రి గంగాధర్ అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం బాధితుడి ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావ్ పటేల్ పరామర్శించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పుండలిక్, చంద్రకాంత్ యాదవ్, గోవింద్‌రావ్ పటేల్, మారుతి పటేల్, దేవిదాస్ కార్యకర్తలు ఉన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా ఆవిర్భావ వేడుకలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో శనివారం బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవస్థాపకులు మహారాజా సాయాజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. మేనేజర్ జయంత్ మాట్లాడుతూ దేశంలోనే రెండో పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకుగా నిలిచిందన్నారు. దేవరకోట చైర్మన్ ఆమెడ శ్రీధర్, కిషన్, అడ్వకేట్ సుదర్శన్, రాజు, శ్రీనివాస్, దాసు, రఘుదీర్, సత్యనారాయణ, ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు కార్యదర్శులు బదిలీ అయ్యారు. శనివారం మండలంలోని రాచాపూర్ పంచాయతీ కార్యదర్శి హరితరెడ్డి, ధర్మారం పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, పార్‌పెల్లి పంచాయతీ కార్యదర్శి సౌజన్య, మల్లాపూర్ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, బాబాపూర్ పంచాయతీ కార్యదర్శి బదిలీ అయ్యారు. దీంతో వీరిని ఆయా గ్రామ పంచాయతీల్లో సిబ్బంది ఘనంగా సన్మానించారు.

బాసర: మండల కేంద్రానికి చెందిన లక్ష్మీ–రాజు దంపతుల కుమారుడు సాయికుమార్ ఎస్‌బీఐ క్లర్క్‌ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈమేరకు శనివారం అతడిని మాజీ సర్పంచ్ డి.లక్ష్మణ్‌రావు, స్థానికులు రాజు దేశాయ్, బాలమల్లన్న యాదవ్, జిడ్డు మల్లయ్య యాదవ్, జ్ఞానిపటేల్, మహేశ్, సాయికృష్ణ, శివ, భాస్కర్ శాలువాతో సన్మానించారు.

ఆశ్రమ పాఠశాలలో ఎన్నికలు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం విద్యార్థులకు నమూనా ఎన్నికలు నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం ముక్క రాజేశ్వర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఎన్నికల్లో పాల్గొన్నారు.


రోడ్లపై కేజీవీల్స్ నడపొద్దు

సోన్: రోడ్లపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై కె.గోపి ఓ ప్రకటనలో తెలిపారు. కేజీవీల్స్‌ను ట్రాక్టర్ ట్రాలీలో, లేదా రబ్బరు తొడుగులను ఉపయోగించి పొలాల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ట్రాక్టర్ యజమానులు విధిగా నిబంధనలు పాటించాలని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి

ముధోల్ : సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ విఠల్ అన్నారు. శనివారం ముధోల్‌లోని కస్తూర్బాను సందర్శించి మాట్లాడారు. విద్యార్థులు భోజనానికి ముందు శుభ్రంగా చేతులు కడుక్కోవాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ ఫాతిమా, సిబ్బంది ఉన్నారు.

వనమహోత్సవం లక్ష్యం పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీవో అబ్దుల్ సమద్

తానూరు: వర్షాలు కురుస్తున్నందున వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నాటిన మొక్కల వివరాలను సేకరించారు. మురికి కాలువలను శుభ్రపరిచి ప్రజలకు క్లోరినేషన్ నీటిని అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్‌సింగ్, ఈజీఎస్ ఏపీఓ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో ఆషాఢ బోనాలు



నిర్మల్‌లో చిన్నారులతో నరేందర్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్ అల్ఫోర్స్ పాఠశాలలో శనివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నత్యాలు అలరించాయి. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ విశిష్టత, గోరింటాకు పెట్టుకుంటే శరీరంలో వేడి తగ్గుతుందని వివరించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భైంసా అల్ఫోర్స్‌లో..

భైంసాటౌన్: పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో శనివారం మెహెందీ, బోనాల పండుగ ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి హాజరై జ్యోతి వెలిగించి అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



గుండేగాం వాగు పరిశీలిస్తున్న సీఐ నైలు

సోన్: వర్షాలు ఉధృతంగా కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కె.గోపి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గోదావరి నది, స్వర్ణ ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లోకి ప్రజలెవరూ వెళ్లవద్దని సూచించారు. నది పరిసరాల్లోకి పశువులను మేపేందుకు, చేపల వేటకు వెళ్లవద్దన్నారు. ఇబ్బందులుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

భైంసారూరల్: మండలంలోని గుండేగాం, మహాగాం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ నైలు అన్నారు. శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి గుండేగాం వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో శనివారం సిబ్బందితో కలిసి సీఐ వాగును పరిశీలించారు.

రెండున్నర ఏళ్లు దాటిన చిన్నారులను చేర్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

సారంగపూర్: రెండున్నర ఏళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయగౌరి అన్నారు. మండలంలోని కొట్టె(బి) గ్రామంలో అమ్మమాట–అంగన్వాడీ బాటలో భాగంగా శనివారం చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి చిన్నారుల తల్లిదండ్రులకు పలు అంశాలు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాధ, అన్నపూర్ణ, జ్యోతి, చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఉన్నారు.

మొక్కలు నాటిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు



మొక్కలు నాటుతున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

కుభీర్: మండల కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు శనివారం మొక్కలు నాటారు. ప్రధాని పిలుపు మేరకు అమ్మ పేరిట మొక్క కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు తమ తల్లి పేరిట మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ కార్యవాహ రాజుల దిగంబర్ మాట్లాడుతూ వచ్చే ఏడాది నాటికి ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు పూర్తి కానుండటంతో శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సేవా ప్రముఖ్ అడేపు శ్రీనివాస్, ద్విఖండ ప్రచారక్ అనంతసాయి, ఖండ శారీరక్ ప్రముఖ్ గజ్జారాం, జిల్లా సేవా కార్యవర్గ సభ్యుడు శివలింగం, ఖండ ప్రచార ప్రముఖ్ శ్రీనివాస్, ఖండ ప్రచార ప్రముఖ్ బాలాజీ, నాయకులు ఆనంద్, హన్మాండ్లు, కనకయ్య తదితరులు ఉన్నారు.

చించోలి(బి) పాఠశాలలో వైద్యశిబిరం



శిబిరం పరిశీలిస్తున్న ఎంఈఓ మధుసూదన్

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) ఉన్నత పాఠశాలలో శనివారం డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల రక్తనమూనాలు సేకరించి వారి రక్తవర్గాలు, హెల్త్‌ప్రొఫైల్ వివరాలు తెలిపారు. అనంతరం 14 ఏళ్లు నిండిన విద్యార్థులు రక్తదాతలుగా పేర్లు నమోదు చేయించుకున్నారు. వ్యాధుల బారిన పడకుండా పరీక్షలు చేసి మందులు అందించినట్లు డాక్టర్ పేర్కొన్నారు. శిబిరాన్ని ఎంఈఓ మధుసూదన్ పరిశీలించారు.

పోషకుల సమావేశం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడో శనివారం కావడంతో పాఠశాలలో నోబ్యాగ్ డే, పోషకుల సమావేశం నిర్వహించారు. హెచ్ఎం కూన రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులను ఇళ్లలో చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

లక్ష్మణచాంద: అర్హులైన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని లక్ష్మణచాంద క్లస్టర్ ఏఈవో ఉమా మహేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 28జూన్ 2024 నాటికి పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు. దరఖాస్తు ఫారంతోపాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, నామినీ ఆధార్ జిరాక్స్‌లను వెంట తీసుకురావాలని సూచించారు. ఆగస్టు 4 వరకు గడువు ఉందన్నారు. రైతుబీమాలో తప్పుల సవరణకు ఈనెల 30 వరకు గడువు ఉందని.. సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.

ముధోల్: 28 జూన్, 2024 వరకు పట్టాదార్ పాసు బుక్ పొందిన రైతులు సమీపంలోని వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించి రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో భాస్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రుణమాఫీపై సందేహాలు ఉంటే ఏఈవోను సంప్రదించాలని పేర్కొన్నారు.

గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం



కల్లూర్‌లో సప్తాహంలో భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో శనివారం గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమయ్యాయి. అర్చకులు బాబాకు మంగళస్నానం, అభిషేకం, అర్చన, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం వరకు సాయి సప్తాహం కొనసాగనుంది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

కన్కపూర్‌లో నేడు..

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామ శివారులోని బ్రహ్మేశ్వరాలయ ఆవరణలో సత్యానంద సరస్వతీ స్వామిజీ సమాధి వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు బ్రహ్మేశ్వరాలయం కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు సకాలంలో రావాలని వారు కోరారు.